
కథ

# పౌత్ర లాభం

కవన శర్మ




''థూ...! నోటికి సుట్ట రుచి కూడా తెల్సిసావడం లేదు. మీ సైంటుఫిక్కోళ్ల బాగవతాలు సెప్పి సెప్పి నాలుక బండబారి పోయింది రా!'' అని సిద్ధయ్య బాహాటంగా విసుక్కున్నాడు చుట్ట పొగ ఓసారి దట్టంగా పీల్చి. అల్లుడు కమ్ మేనల్లుడు గోపన్న ఉరఫ్ గోపాల్రావుకి అర్థమైంది. సిద్ధయ్య మావకి మరో భాగవతం మీదకి మనసు మళ్లిందని. ముందస్తు ఎన్నికలు అతని ఆలోచనలనాక్ర మిస్తున్నాయని.

''పోన్లే మావయ్యా! మా కథలు వద్దు! మీ రాజకీయాల కథే చెప్పు. ఈ ముందస్తు ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందంటావ్? ఈ దిబ్బ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి మనవాడయ్యే అవకాశం ఎంత? ఇంత మంచి రాష్ట్రం ఎందుకు దిబ్బయిపోయింది?'' అంటూ ఉత్సాహం ప్రదర్శిస్తూ ప్రశ్నలు గుప్పించాడు గోపన్న.

గోపాల్రావ్ రిటైరయినప్పటి నుంచి, స్వంత రాష్ట్రానికి వచ్చేసి, ఊసుపోవడానికి అడ్డమైన సాహిత్య సభలకి, కుప్పిగంతుల నాట్య ప్రదర్శనలకి, అపస్వరాల సంగీత సభలకి వెళ్లసాగాడు. సభలో ప్రదర్శనలకి వేదికలంటూ వుంటాయి. వాటిని అలంకరించడానికి సినిమా వాళ్లు, పోలీసులు, అయ్యేయస్సులు వుంటారు. వాళ్లకి పనులుంటాయి. దాని వల్ల గంటలకొద్దీ ఆలస్యమవుతూ వుంటారు. వాళ్లు వచ్చాక వాళ్లని పొగడ్డాటలు, పుష్పగుచ్ఛాలివ్వడాలు వుంటాయి. అటువంటి సభలు ప్రదర్శనలు ప్రేక్షకుల, సభాసదుల సహనాన్ని పెంచుతూ వుంటాయి. నాలుగు సభలకి వెళ్లి నిల దొక్కుకున్నవారికి రక్తపోటు పాతిక శాతం తగ్గినట్లు 'కోటి గొప్పల' డాక్టరు అనకాపల్లి అంతర్జాతీయ కాన్ఫరెన్సులో పేపరు చదివారు. ఆకేస్ స్టడీల్లో ఒక కేసు డాక్టర్ గోపాల్రావు. ఇతడు నిఝం డాక్టరు కాదు. సైంటిస్టు. ఇతడిది ఎక్వైర్డ్ పీసీ సిండ్రోమ్ (ఎపియస్). కేవలం ఈ శాంత లక్షణం వల్ల, సిద్ధయ్య కథ చెప్పే వరకు వినగలడు. కవనశర్మ ఉపోద్ఘాతాలు విసుక్కోకుండా చదవగలడు.

అసింతామణి తెల్లచీర కట్టుకొని, మల్లెపూలు మాలగుచ్ఛుతోంది. సిద్ధయ్య తన కుమారీ మణిని చూసి కథ చెప్పడం మొదలుపెట్టాడు.

''ఈ ప్రాంతం పూర్వం సొర్ణ సీమలా వుండేదిట. సోడా పార్టీ వరసగా పదేళ్ల పాటు సల్లగా పరిపాలిస్తే రాబోయే సొర్ణ సీమ ఎలా వుండబోతోందో అల్లా అన్నమాట. 'మందుల' పార్టీ తేబోయే రాములోరి రాజ్జెంలాగా అన్నమాట. ఆ గొప్ప దినాల్లో బ్రిటీ సోళ్లు కలకత్తాని రాజధానిగా సేసుకొని మనల్ని పాలించే వోరు. మనం ప్రాంతం పేరు, నోరు తిరగని బెంగాలీల నోట 'దిబిసీమ'గా విన్న ఇంగ్లీసోళ్లు దీన్ని దిబిప్రోయిన్స్ అన్నారు. ఆళ్లకి నోరు తిరగకపోతే మనకేనేటి తిరిగేదని, మన తిరుగుబోతు నాయాళ్లో పెద్దల మీద తిరుగుబాటు సేసి దిబ్బ రాష్టం అనటం మొదలుపెట్టారు. తెలుగు అధికార భాసయ్యాక 'దివి' సంసుక్రుతం మాట అని దిబ్బ అసలు సిసలైన తెలుగు మాట అనీ అధికార భాషా సంగం తీర్మానించింది. పైగా నాయకులంతా వినాయకుల్లాగ దిబ్బగా వుండడంతో అదే ఖాయం అయింది. ఇదెప్పుడు సోడాల పార్టీ, చక్రాల చందురుడు పవర్‌లోకి రాక ముందు ఆ పార్టీ ఈసారి, మరోసారి పవర్‌లోకి వచ్చాక, అంటే ఈ విసాల దిబ్బరాష్టం పై అధికారం సేజిక్కించుకున్నాక పేరు మారుస్తుంది.

'విశాల రాష్ట్రం మూడు ముక్కలవుతుందేమో!' గోపాల్రావ్ అనుమానంగా అడిగాడు.

''అయితే ఇంకేటవుద్ది. ఒక దిబ్బ మూడు దిబ్బలవుద్ది! ఇక్కడ రాజకీయాలన్నీ దిబ్బరాజకీయాలేగా! వొయిసెమ్యాలు మనసుల మద్దె అంతరాలు పుట్టిస్తున్నాయి. అందుకనే మొన్నమన గడ్డిపాడు సాస్తుల్లుగారు 'ఇది వొయివస్వాత మనవంతరం కాదు. మన అంతరాలు పెంచే వొయిసెమ్యాల సారం' అన్నారు''

ఎంత రవీంద్ర భారతులకి, కళాభారుతలకి వెళ్తున్నా సహనానికి హద్దు లేకుండా పోదుకదా! గోపన్నాస్ ఎపియస్ హౌస్ లిమిట్స్

''మావయ్యా నేరుగా కథలోకి వచ్చి టూకీగా కథ చెప్పు!'' అన్నాడు గోపన్న.

''అమ్మాయ్! అల్లుడు దేనికో తొందరపడ్తున్నాడు'' అంటూ మణికేసి చూసి నవ్వాడు సిద్ధయ్య. మణి బుగ్గలు ఎర్రబారాయి. సిద్ధయ్య కథందుకొన్నాడు.

***

దిబ్బ ప్రాంతంలో స్లోగన్నుల పార్టీ, గన్నుల పార్టీ అని రెండు పార్టీలు చాలా బలంగా వుండేవి. గన్నుల పార్టీకి సుత్తుల రత్తయ్య నాయకుడుగా వుంటే స్లోగన్నుల పార్టీకి ఇటికల బంగారమ్మ నేతృత్వం వహిస్తోంది. స్లోగన్నుల పార్టీ జాతీయ పక్షం అయితే, గన్నుల పార్టీది అంతర్జాతీయ స్థాయి. ఎన్నికల్లో స్లోగన్నులు పేలినట్టుగా, గన్నులు పేలేవి గావు. అందుచేత స్లోగన్నుల పార్టీకి కన్నులు కైపెక్కి, తల పైకెక్కాయి. దిబ్బ దేశం ఆపార్టీని గెలిపిస్తూ వచ్చినా, దాని నాయకత్వం అలక్ష్యం చేస్తూ, తలదించుకు నేలా చేస్తూ వచ్చింది. అప్పుడు ప్రాంతీయ స్థాయిలో సోడాల పార్టీ పుట్టింది. పైగా స్లోగన్నుల పార్టీ ''తన మతమేదో తనది మన మతమసలే పడదోయ్'' అన్న ధోరణిలో జాతీయస్థాయిలో వుండేసరికి జాతీయ స్థాయిలో మందుపార్టీ ''జాతి దుర్బలం అయిపోతోంది. జాతికి మంచి మందు పడాలి'' అని వాయిస్తూ ముందకు వచ్చింది.

''వారిచ్చే మందు మత్తు మందు. మతం కంటే చెడ్డది ఆ మందు. మీరు మందమతులు కారు. ఆ మందు మీరు పుచ్చుకోరు''అంటూ ''మందు= మందమతులకీ'' అన్న స్లోగన్నులు తయారుచేసుకొంది స్లోగన్నుల పార్టీ. కొత్త పార్టీల విషయంలో స్లోగన్నులకి, గన్నులకి అభిప్రాయాలు కలిసాయి. కలిసిదాడులు నిర్వహించాయి.

''ప్రాంతీయతని ఎంతో కాలం తొక్కి ఉంచలేరు. ఇప్పుడు దిబ్బ దేశంలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఎన్నికల గోలీ అడ్డు తొలగగానే ఉత్సాహం సోడాలా, బయటకి విజయ రూపంలో తన్నుకువస్తుంది.'' అంటూ దాని నాయకుడు చక్రం తారా చంద్రుడు ఊరూర ఊదరగొట్టసాగాడు.

''గోలీ తీయగానే ఏముంది? కాసేపు బుస్సని తరువాత తుస్సనడమే'' అన్నాయి విపక్షాలు.

''మందుకి సోడా కలిపితే, మందుకు మన్నన, సోడాకి సొగసు వస్తాయి. 'మనం మతవ్యతిరేకులని గెలవడం సులభం అవుతుందని' మందు పార్టీ నాయకుడు కమలం రామన్న సూచించి సోడా పార్టీ సపోర్టు సంపాదించాడు.


ఎన్నికలు జరిగాయి. జాతీయ స్థాయిలో మందు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే రాష్ట్ర స్థాయిలో సోడా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ప్రజా సామ్యంలో కొత్త శకం ఏర్పడింది. పరస్పర నిధార రాజకీయాలకి, సంకీర్ణ ప్రభుత్వాలని అంకురార్పణ జరిగింది.

***

''ఇదిరా గోపన్నా! పాతికేళ్ల కిందటి కత'' అని సిద్ధయ్య చుట్టని మరోసారి వెలిగించుకొన్నాడు.

''అద్సరే మావయ్యా! ప్రజలు అధికార పక్షవ్యతిరేకులు కదా! ఇప్పుడు మళ్లీ కొత్త స్లోగన్నులతో, గన్నుల బలంతో పాత పార్టీలే అధికారంలో వున్నాయి కదా! ముందస్తు ఎన్నికలు వస్తున్నాయి అంటున్నారు. నువ్వేమిటంటావ్? ఏ పార్టీలు గెలుస్తాయి?'' గోపన్న ఉత్సాహంగా అడిగాడు.

''చాలా కస్టం చెప్పటం. ఎన్నికలయ్యాక పొత్తు పెట్టుకోవడం ఒకరకంగా ఇబ్బంది. అయితే ఎన్నికల



**''లాస్టయిము ఆడుగెల్సాడని కదా ఆడికి టికెట్టిస్తున్నారు. ఆడెప్పుడు గెల్సాడు? నానోడాను కనుక! నేనోడానంటే అప్పుడు మరిపొత్తుల్లేవు. ఆడు పైగా మనతో ఈరోజు పొత్తు పెట్టుకోబోతున్న పార్టీవోడేగాని, మన పార్టీవోడు గాదు. నేను మనపార్టీవోడిని. ఆడు నామీద పోటీ పడి గెల్సినోడు. అంటే మన శత్రువు. అయినా నేనోడినప్పుడు గెలవడం మగతనం గాదు. నేను రేపు గెల్సినప్పుడాడిని గెలవమనండి సూద్దాం'' అన్నాడు పంతం పద్మనాభం.**

ముందు పొత్తు పెట్టుకోవడం ఒక విధంగా సూస్తే లాభం కానీ మరో విదంగా సూస్తే మాసెడ్డ గొడవ.''

''వివరంగా చెప్పు మావయ్యా''అని అడిగాడు గోపన్న. మణి మాల కట్టడం ఆపి తండ్రికేసి చూసింది. మణిని ఆపేక్షగా చూస్తూ సిద్ధయ్య కథ చెప్పాడు.

* * *

సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడం రెండు రకాలుగా జరిగింది ఈ పాతికేళ్లయు. మొదట్లో పార్టీలన్నీ ఎన్నికలకి తమ బలాలు అంచనాలు వేసుకొని పోటీలో దిగేవి గతంలో ఎన్నికల ముందు. ఎన్నికలయ్యేసరికి సోడాల పార్టీ ఓ పాతిక, మందు పార్టీ రెండువందల పాతిక జాతీయస్థాయి ఎన్నికల్లో గెల్చాయి. స్లోగన్నుల పార్టీ నూటయాభై, గన్నుల పార్టీ ఎనభై, స్వతంత్రులు పది, తలే తప్ప తోక పెద్దగా లేని పార్టీ పది స్థానాలు గెల్చాయి. అప్పుడు చక్రాల చంద్రుడు త్వరగా పావులు కదిపాడు.

''రామన్నా జీ! మేము మీ పార్టీని బలపరుస్తాం. మాకు పదో వంతు మంత్రి పదవులివ్వండి'' అన్నాడు.

''మీరు మేమూ కలిసినా 250 మాత్రమే. మెజారిటీకి ఒకటి తక్కువ''అన్నాడు రామన్న.

''ఒక స్వతంత్రుడికి సహాయ మంత్రి పదవి ఇచ్చి సరిపెడ్దాం''అన్నాడు చంద్రుడు.

''మరి దిబ్బ రాష్ట్రంలో మాకెన్ని మంత్రి పదవులిస్తారు?''అని అడిగాడు రామన్న.

''మాకు ప్రాంతీయ స్థాయిలో మెజారిటీకి ఐదు స్థానాలే తక్కువ. స్వతంత్రుల్ని కలుపుకుంటాం''అన్నాడు చంద్రుడు.

''స్వతంత్రులు మంత్రి పదవులివ్వకపోతే కలవరు. ఆ అయిదూ మాకే ఇస్తే మా మందు పార్టీ నుంచి నెగ్గిన పదిమందీ మీక సపోర్టు చేస్తారు''అని రామన్న బేరం పెట్టాడు.

చేసేది లేక చంద్రుడు ఒప్పుకున్నాడు. అయిదేళ్ల పాటు మందు సోడా, పాలూ నీళ్లల్లాగా కలిసిపోయారు. కలిసి రాజ్యం చేసారు.

స్లోగన్నుల పార్టీ... ముఖ్యంగా ఇటికల బంగారమ్మ కటకటలాడిపోయింది. పరిపాలించడానికి ప్రజలు లేక, గన్నుల పార్టీకి మందు పార్టీ అంటే పడక పాలనకి దూరమై పడరాని పాట్లు పడ్డారు. సుత్తుల రత్తయ్య మరుసటి ఎన్నికల నాటికి మెత్తబడి, స్లోగన్నులతో ఎన్నికల ఒప్పందానికి దిగాడు.

సరిగ్గా ఆ సమయంలో వేరు కుంపట్ల ముక్కనుడు దిబ్బ రాజ్యాన్ని రెండు ముక్కలు చేయాలంటూ సోడా పార్టీ నుంచి వేరుపడి స్వంత కుంపటి పెట్టుకున్నాడు.

బంగారమ్మ ''నా ఇటికల మీద మీ కుంపటి చక్కగా అమరుతుంది.'' అని ముక్కన్న ముక్కుకి తాడేసి తన దారిలోకి తెచ్చుకుంది. రత్తయ్య వేడి మీదున్న బంగారమ్మని రెండు సుత్తి దెబ్బలు వేసి కమ్మేచ్చు లాగాడు.

చంద్రుడికి, అనవసరంగా రామన్న పాదుకలు మోస్తున్నట్టు అనుమానం కలిగింది. మా చక్రం మేమే తిప్పుకుంటామన్నాడు. ఎన్నికలు జరిగాయి. జాతీయస్థాయిలోను, ప్రాంతీయస్థాయిలోనూ స్లోగన్నులు పేలాయి. రెండో ముక్కలో కుంపట్లు వెలిగాయి. చక్రంలో గాలి తీసేసినట్టయింది. మందులో పొటెన్సీ తగ్గిపోయింది. పొత్తు లాభం అని తేలిపోయింది. ఎన్నికలైన ఏడాదికి ముక్కన్న తన భాగం ఇవ్వనందుకు మూడోకన్ను తెరిచాడు. రత్తయ్య తన మాట వినక పోతే గన్నుతో షూట్ చేస్తానంటూ బెదిరించసాగాడు. కొత్త ఎన్నికలు ఏడాది దూరంలోకి వచ్చాయి. బంగారమ్మ తలనొప్పికి మంత్రం ఏమిటా అని ఆలోచిస్తుంటే ''ముందస్తు ఎన్నికలు ఒకటే మంత్రం'' అన్నాడు కొడుకు రాహుళ్లుడు.

''పాత పార్టీల్లో జీవం తగ్గింది. కొత్త జీవం పొయ్యాలి. సంజీవిని రాజకీయాల్లోకి రప్పించాలి'' అన్నారు ప్రజలు.

''సంజీవి మా పార్టీలోకి వస్తే మాకు సంతోషమే'' అన్నాయి అన్ని పార్టీలు. రాజకీయాల్లోకి వచ్చాక ఎంత తారకమంత్రమైనా పదవీగ్రహణం ఆపలేదు. ఏ సంజీవి పుల్ల అయినా రాజకీయ పోపులో కరివే పాకే అన్నారు. అతగాడు తమ పార్టీలో చేరడని తెలి సాక ఉక్రోషంతో చెందరు విజ్ఞులు.


* * *


''అదిరా గోపన్నా! ఇప్పటి పరిస్థితి. పొత్తులాభం అన్న చద్దిమూట, పాచిపట్టేసింది. అదేలే పెద్దల మాటకి కాలం సెల్లిపోయింది. అసలు సీనెలా గుందంటే...'' సిద్ధయ్య చెప్పసాగాడు.


* * *

ఎన్నికల ముందు పొత్తు లాభం అన్నది అర్థ మయ్యాక అందరూ పార్టీల మధ్య పొత్తుకి ఓటు వేశారు. కాని అదే వ్యక్తుల మధ్య పోరుకి దారితీసింది.

ఈసారి ఎన్నికలు నినాదాల సూర్రావుకి, చేతుల చొక్కారావుకి తల నొప్పిగా తయారయ్యాయి.






సుత్తల రత్తయ్యకి చక్రాల చంద్రుడికి కూడా తలమీది కిరీటం నిలుస్తుందన్న నమ్మకం కలగడం లేదు. బంగారమ్మ బెంగెట్టేసుకుంటే రామన్న మన్ను కరుస్తానని భయపడసాగాడు.

పొత్తు పెట్టుకుంటే గెలవడం ఖాయం కనుక 'మన పార్టీ వాళ్లనే చేతనైనంతమందిని కామన్ కేండిడేట్సుగా అవతల పార్టీని మెడలు వంచి ఒప్పించాలి'' అని ప్రతీ పార్టీ హిడెన్ ఎజెండాలతో పొత్తు కసరత్తులు మొదలుపెట్టింది.

గెలవడం ఖాయం అయినప్పుడు 'మనమే గెలిస్తే పోలా' ఇంకోళ్లని గెలిపించడం ఎందుకు? అన్న భావం వీళ్ల మొహాల మీద కొట్టొచ్చినట్లు కనిపించడంతో ఇంకొకళ్లు కొట్టొచ్చారు.

* * *

''ఎప్పుడూ మీ కులం గొడ్డుపోయిందా?'' అని మరొక కులం వారంటే ''మా కులం వాళ్లంటే ఎప్పుడూ లగుడోళ్లేనా? సర్పంచులూ ఆళ్లే, సమితి ప్రసిడెంట్లూ ఆళ్లే, మా రొంగలోళ్లని పెట్టడానికి మీకు రోగాలొస్తాయా?'' అన్నారు రొంగలోళ్లు.

''ఎప్పుడూ ద్రోణంరాజులు, పెమ్మరాజులేనా రాజ్యాలేలేది'' అంటూ భాగతులవారు, వెంటివారు చిందులు వేశారు.

''మా ఆయన పోతే ఆయన్తోపాటు నేనూ పోయాననుకున్నారా?'' అని ఝాన్సీ లక్ష్మీ, పార్వతిలా పళ్లు కొరుకుతూ ప్రజల్ని నిలదీసింది.

''నేనే నిలబడాలని ఆవిడలాగా పట్టుపట్టను. నేననేది ఏమిటంటే బంగారమ్మకి కొడుకుంటే నాకూ కూతురుంది. రాహుల్లుడు నాయకుడైతే రాళ్లలాంటి కాండిడేట్లు హుళక్కైపోతారు. అదే నా వరమ్మకి టికెట్టిస్తే, అది పార్టీకి, దేశానికి ఓ వరమైపోతుంది' 'అంది మానిక్కమ్మ.

''లాస్టయిము ఆడుగెల్నాడని కదా ఆడికి టికెట్టిస్తున్నారు. ఆడెప్పుడు గెల్నాడు? నానోడాను కనుక! నేనోడానంటే అప్పుడు మరిపోత్తుల్లేవు. ఆడు పైగా మనతో ఈరోజు పొత్తు పెట్టుకోబోతున్న పార్టీవోడేగాని, మన పార్టీవోడు గాదు. నేను మన పార్టీవోడిని. ఆడు నామీద పోటీ పడి గెల్సినోడు. అంటే మన శత్రువు. అయినా నేనోడినప్పుడు గెలవడం మగతనం గాదు. నేను రేపు గెల్సినప్పుడాడిని గెలవమనండి సూద్దాం'' అన్నాడు పంతం పద్మనాభం.

ఆ విధంగా కుంపట్లువారు, కోళ్ల వారు తాము లేకపోతేప తమ పార్టీ గెలవకూడదని, పార్టీ విడిచి వెళ్లిపోవడానికి కుంపట్లు, కోళ్లు సర్దుకుని రెడీగా వున్నారు.

* * *

''ఏ పార్టీ గెలుస్తాదో సెప్పటం కస్టంరా గోపన్నా! అందుకే ఎన్నికలయ్యే వరకు ఆగి మనం గెలిసినోడిని సపోర్టుసెయ్యాల'' అన్నాడు సిద్ధయ్య.

పార్టీల మధ్య పచ్చగడ్డి భగ్గుమంటోంది. సిద్ధయ్య చుట్ట ఆరకుండా కాల్తోంది.

''అయితం పూడిలో ఎన్నికలొస్తే మాత్రం ఊడల బడామియా గారికే మీ వోటు'' అంటూ దూరంగా మైకులో ఎవరో అరుస్తున్నారు. టికెట్టు వస్తే మంచిది. లేకపోతే ఆయన ఇండిపెండెన్సెక్కడకీ పోదు. మైనారిటీ తీరదు.

హువాతో హవా! నహువాతో వహ్వా!

గోపన్న భోజనానికి లేచాడు. మణి అనుసరించింది. ★



## గోపికకు త్వరలో పెళ్ళంట!?

గోపికకు ఈ మధ్యనే ప్రదానం అయిందని కోలీవుడ్‌లో ఒకటే గుసగుసగా చెప్పుకుంటున్నారు. తాంబూలాలు తీసేసుకున్నారు. పెళ్ళొకటే ఆలస్యం అంటున్నారంతా. అయితే అలాంటిదేమీ లేదని వాళ్ళమ్మగారు ఒకటే గోల చేస్తున్నారు. 'ఎవరో బంధువుల అబ్బాయిట కదండీ! అమెరికాలో ఉంటున్నాట్ట కదా! మంచి సంబంధమే అంటున్నారంతా' అంటే 'అయ్యో అదేం లేదండీ! అసలు మాలో బంధువులకు అమ్మాయిల్ని ఇచ్చుకోం. మా సంప్రదాయం కాదది' అంటూ బాధపడుతోందది గోపిక తల్లి. ఏదేమయినా త్వరలోనే గోపికకి పెళ్ళని కోలీవుడ్ కోడై కూస్తోంది. అంత గట్టిగా ఎలా చెప్పగలరంటే 'ఏం ఉందండీ! ఎలానూ ఇప్పుడు సినిమాలు లేవు కదా' అన్నది వారి వాదన.